# నమస్తే తెలంగాణ
# మహబూబాబాద్
5 | సోమవారం 12 ఆగస్టు 2024 | MAHABUBABAD




# వామ్మో.. మేం రాం..
## బల్దియాకు రావడానికి జంకుతున్న ఉద్యోగులు

- ఎస్ఈ పోస్టు ఖాళీ.. ఈఈకి ఇన్‌చార్జి బాధ్యతలు
- 8 మంది శానిటరీ ఇన్‌స్పెక్టర్ల బదిలీ
- ఒక్కరు కూడా జాయిన్ కాలే..

వరంగల్, ఆగస్టు 11 : గ్రేటర్ వరంగల్ కార్పొరేషన్ అంటేనే ఇతర ప్రాంతాల ఉద్యోగులు వణికిపోతున్నారు. బదిలీపై ఇక్కడకు రావడానికి ససేమిరా అంటున్నారు. బల్దియా నుంచి పైరవీలు చేసుకుని మరీ బదిలీపై వెళ్లిన వారు ఎక్కువగా ఉండగా, బల్దియాకు రావడానికి మాత్రం ఇతర ప్రాంతాల ఉద్యోగులు జంకుతున్నారు. గ్రేటర్ కార్పొరేషన్‌లో పనిచేయడానికి ఉద్యోగులు భయపడుతున్నారు. రాజకీయ నేతల ఒత్తిడులు, పని భారం తట్టుకోలేక వెళ్లిపోతున్న వారు ఎక్కువగా ఉంటే, రావడానికి మాత్రం ఎవరూ ముందుకు రావడం లేదు. ఇంజినీరింగ్ విభాగంలో ఎస్ఈ కృష్ణారావు పైరవీ చేసుకుని మరీ జీహెచ్ఎంసీకి బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో ఇక్కడకు మరెవ్వరు రాలేదు. దీంతో ఈఈకి ఎస్ఈగా అదనపు బాధ్యతలు అప్పగించారు.

**ప్రజారోగ్య విభాగంలో 8 మంది బదిలీ**

బదిలీల్లో భాగంగా ప్రజారోగ్య విభాగంలో 8 మంది శానిటరీ ఇన్‌స్పెక్టర్లు బదిలీ అయ్యారు. 23 విలీన గ్రామాలను కలుపుకొని 407.71 చదరపు అడుగుల విస్తీర్ణం, 10 లక్షలకు పైగా జనాభా, 66 డివిజన్లతో ఉన్న గ్రేటర్ కార్పొరేషన్‌లోని ఒక కీలక విభాగంలో ఒకేసారి 8 మంది శానిటరీ ఇన్‌స్పెక్టర్లు బదిలీ అయినా ఇతర ప్రాంతాల నుంచి ఒక్క శానిటరీ ఇన్‌స్పెక్టర్ రాలేదు. ఒక్కరు కూడా వరంగల్ కార్పొరేషన్‌కు ఆప్షన్ పెట్టుకోకపోవడం గమనార్హం. ప్రస్తుతం 317 జీవోలో డిప్యుటేషన్‌పై పనిచేస్తున్న నలుగురితోపాటు మరో ముగ్గురు శానిటరీ ఇన్‌స్పెక్టర్లు మాత్రమే ప్రజారోగ్య విభాగంలో ఉన్నారు.

**ఇన్‌చార్జి ఎస్ఈ..**

బల్దియా ఎస్ఈ కృష్ణారావు బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో మరెవ్వరికీ పోస్టింగ్ ఇవ్వలేదు. వరంగల్ కార్పొరేషన్‌కు రావడానికి ఎవరూ ముందుకు రావడం లేదని బల్దియా ఉద్యోగులే చెబుతున్నారు. అయితే, ఎస్ఈ కృష్ణారావు బదిలీల జాబితాలో లేకున్నప్పటికీ ఆయన పైరవీ చేసుకుని మరీ వెళ్లారు. ఆయన స్థానంలో కొత్త వారు రాకపోవడంతో ప్రస్తుతం ఈఈగా ఉన్న రాజయ్యకు ఎస్ఈగా అదనపు బాధ్యతలు అప్పగించారు.

***ఒక్కొక్కరికి 7 డివిజన్లు..***

ప్రస్తుతం ఒక్కో శానిటరీ ఇన్‌స్పెక్టర్ 6 నుంచి 7 డివిజన్ల బాధ్యతలు చేపట్టాల్సిన పరిస్థితి. కార్పొరేషన్ పరిధిలో ప్రధాన విభాగం ప్రజారోగ్య విభాగం. తెల్లవారుజాము నుంచి కార్మికులు విధుల్లో చేరి నగరాన్ని శుభ్రం చేసే పనిలో ఉంటారు. కార్మికుల హాజరు, చెత్త తరలింపు, రోడ్ల పరిశుభ్రతను క్షేత్రస్థాయిలో పర్యవేక్షించే బాధ్యతలను శానిటరీ ఇన్‌స్పెక్టర్లు చేస్తుంటారు. గతంలో ఒక్కో శానిటరీ ఇన్‌స్పెక్టర్‌కు 3 నుంచి 4 డివిజన్లు ఉండేవి. ప్రస్తుత బదిలీల నేపథ్యంలో 7 డివిజన్ల వరకు చూడాల్సి వస్తోంది. నగరంలో ఎక్కడ చెత్త తీస్తున్నారో పర్యవేక్షించడం వీరికి కష్టంగా మారింది. దీంతో నగర పారిశుధ్య వ్యవస్థ పడకేసే అవకాశాలు ఉన్నాయి.

## పర్వతగిరి సీఐపై సస్పెన్షన్ వేటు
### వీఆర్ ఎస్సైపై కూడా..

పర్వతగిరి, ఆగస్టు 11: పర్వతగిరి పోలీసు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఈ శ్రీనివాస్ నాయక్‌ను సస్పెండ్ చేస్తూ వరంగల్ పోలీసు కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. శ్రీనివాస్ నాయక్‌తోపాటు గతంలో ఐనవోలు ఎస్సైగా విధులు నిర్వర్తించిన (ప్రస్తుత వీఆర్ ఎస్సై) జీ అనిల్ కుమార్‌పై అవినీతి ఆరోపణలు వచ్చాయి. ఈ నేపథ్యంలో పోలీసు కమిషనర్ విచారణకు ఆదేశించగా, అధికారులు ఇచ్చిన నివేదికల ఆధారంగా ఇద్దరు అధికారులను సస్పెండ్ చేశారు.

## తొమ్మిది మంది సీఐల బదిలీ

సుబేదారి, ఆగస్టు 11 : వరంగల్ పోలీసు కమిషనరేట్ పరిధిలో తొమ్మిది మంది సీఐలను బదిలీ చేస్తూ ఆదివారం సీపీ అంబర్ కిశోర్ ఝా ఉత్తర్వులు జారీ చేశారు. దుగ్గొండిలో పనిచేస్తున్న బీ రాజ్‌గోపాల్ పాలకుర్తికి, వీఆర్‌లో ఉన్న వీ చేరాలు హసన్‌పర్తికి, ఇక్కడ పనిచేస్తున్న జె సురేశ్ స్పెషల్ బ్రాంచ్ (ఎస్‌బీ)కి, ఎస్‌బీలో పనిచేస్తున్న పీ కిషన్ మడికొండకు, ఇక్కడ పనిచేస్తున్న డీ ప్రతాప్ ఎస్‌బీకి, ఎస్‌బీలో పనిచేస్తున్న కే శ్రీనివాస్ వర్ధన్నపేటకు, అక్కడ పనిచేస్తున్న జీ సూర్యప్రకాశ్ మల్టీజోన్‌కు, ఎనుమాములలో పనిచేస్తున్న పులి రమేశ్ ఎల్కతుర్తికి, ఎస్‌బీలో పనిచేస్తున్న ఏ రాఘవేందర్ వీఆర్‌కు బదిలీ అయ్యారు.



పెద్ద బోటులో ప్రయాణిస్తున్న పర్యాటకులు

## లక్నవరంలో సండే సందడి

ములుగు జిల్లా గోవిందరావుపేట మండలంలోని లక్నవరం సరస్సు వద్ద పర్యాటకుల సందడి నెలకొంది. ఆదివారం సెలవు దినం కావడంతో వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు తరలివచ్చి లక్నవరం అందాలను తిలకించారు. వేలాడే వంతెనలపై నడుస్తూ.. బోట్లలో షికారు చేస్తూ మురిసిపోయారు.

*- గోవిందరావుపేట, ఆగస్టు 11*



నర్సంపేటలోని గోదాములో నిల్వ ఉన్న బియ్యం బస్తాలు (ఫైల్)

*పౌరసరఫరాల సంస్థలో ప్రజాపంపిణీ వ్యవస్థ (పీడీఎస్) బియ్యం రవాణాపై వివాదం తలెత్తింది. కాలపరిమితి ముగిసినందున తాను స్టేజీ-1 గోదాముల నుంచి స్టేజీ-2 గోదాములకు బియ్యం రవాణా చేయలేనని ట్రాన్స్‌పోర్టు కాంట్రాక్టర్ చేతులెత్తేశాడు. కొత్త ట్రాన్స్‌పోర్టు కాంట్రాక్టర్ నియామకం కోసం పౌరసరఫరాల సంస్థ ఇటీవల పిలిచిన టెండర్‌ను కొన్ని కారణాల వల్ల రద్దు చేసింది. దీంతో వరంగల్ జిల్లాలో స్టేజీ-2 గోదాములకు బియ్యం రవాణాకు తాజాగా బ్రేక్ పడింది. ఫలితంగా ఈ నెలలో ఇప్పటివరకు జిల్లాలోని పలు చౌక దుకాణాలకు పీడీఎస్ రైస్ చేరుకోలేదు. కార్డుదారులకు రేషన్ బియ్యం పంపిణీ ప్రారంభం కాలేదు.*

*- వరంగల్, ఆగస్టు 11 (నమస్తేతెలంగాణ)*

# పీడీఎస్ బియ్యం రవాణాపై వివాదం!

### ముగిసిన టెండర్ కాలపరిమితి

- చేతులెత్తేసిన ట్రాన్స్‌పోర్టు కాంట్రాక్టర్
- ఎంఎల్ఎస్ గోదాములకు నిలిచిన రైస్ రవాణా
- 60 రేషన్ షాపులకు అందని 550 టన్నుల బియ్యం
- కార్డుదారులకు తప్పని ఎదురుచూపులు
- పౌరసరఫరాల సంస్థ అధికారుల నిర్లక్ష్యమే కారణం



ఏటా ప్రభుత్వం వానకాలం, యాసంగి రైతుల నుంచి నేరుగా కొనుగోలు చేసిన ధాన్యాన్ని కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) విధానంపై రైస్ మిల్లర్లకు కేటాయిస్తున్న విషయం తెలిసిందే. ఒప్పందం ప్రకారం రైస్ మిల్లర్లు సీఎంఆర్‌ను పౌరసరఫరాల సంస్థలోని స్టేజీ-1లోని బఫర్ గోదాములకు డెలివరీ చేయాలి. పీడీఎస్ ద్వారా తెల్ల రేషన్ కార్డుదారులకు పంపిణీ చేయడం కోసం ఇక్కడి నుంచి స్టేజీ-2లోని మండల లెవల్ స్టాక్(ఎంఎల్ఎస్) గోదాములకు సంస్థ తరలిస్తుంది. ఇందుకోసం టెండర్ల ప్రక్రియ ద్వారా ట్రాన్స్‌పోర్టు కాంట్రాక్టర్లను నియమిస్తుంది. టెండర్ పొందిన కాంట్రాక్టర్ అగ్రిమెంట్ చేసుకొని కాలపరిమితి ముగిసే వరకు రైస్ రవాణా చేస్తారు. కొన్ని సందర్భాల్లో టెండర్ల ప్రక్రియలో ఆటంకాలు ఏర్పడితే ఆయా జిల్లాల్లో టెండర్ కాలపరిమితి ముగిసిన ట్రాన్స్‌పోర్టు కాంట్రాక్టర్లనే సంస్థ కొనసాగిస్తుంది. వీరికి మొదట ఖరారైన రేట్లనే చెల్లిస్తుంది. ఈ క్రమంలో కాంట్రాక్టర్లు కొందరు తమకు రేటు గిట్టుబాటు కావడం లేదని తప్పుకుంటున్నారు. ఆ సమయంలో కొత్త టెండర్ ఖరారు కాకపోతే స్టేజీ-2లోని గోదాములకు బియ్యం రవాణాలో సమస్య తలెత్తుతున్నది. ప్రస్తుతం వరంగల్ జిల్లాలో ఇదే పరిస్థితి ఉత్పన్నమైంది.

**అసలేం జరిగిందంటే..**

వరంగల్ జిల్లాలోని ఏనుమాముల, నర్సంపేట, వర్ధన్నపేట కేంద్రంగా పౌరసరఫరాల సంస్థ స్టేజీ-2 గోదాములను నిర్వహిస్తున్నది. ఈ గోదాములకు బియ్యం రవాణా కోసం పౌరసరఫరాల సంస్థ చివరిసారి 2020లో ఓ ట్రాన్స్‌పోర్టు కాంట్రాక్టర్‌కు టెండర్ ఖరారు చేసింది. అతను నెలనెలా సుమారు 4 వేల టన్నుల పీడీఎస్ బియ్యాన్ని ఇన్నాళ్లు స్టేజీ-2 గోదాములకు రవాణా చేశాడు. అగ్రిమెంట్ ప్రకారం ఇతడి టెండర్ కాలపరిమితి 2021 సెప్టెంబర్ 30తో ముగిసినప్పటికీ అధికారుల సూచనలతో యథావిధిగా బియ్యం రవాణా చేస్తున్నాడు. ఈ క్రమంలో కొత్త ట్రాన్స్‌పోర్టు కాంట్రాక్టర్ నియామకం కోసం పౌరసరఫరాల సంస్థ పలుమార్లు టెండర్లు ఆహ్వానించినప్పటికీ వివిధ కారణాలతో టెండర్లు ఖరారు కాలేదు. చివరిసారి గత మే నెలలో పిలిచిన ట్రాన్స్‌పోర్టు టెండర్ కూడా ఇటీవల రద్దయ్యింది. ఈ క్రమంలో సదరు కాంట్రాక్టర్ తనకు పాత రేట్లు గిట్టుబాటు కావడం లేదని, 2024 జూలై 31వరకు మాత్రమే తాను బియ్యం రవాణా చేస్తానని ఇటీవల అధికారులకు తేల్చి చెప్పినట్లు తెలిసింది. ఆ గడువులోగా బియ్యం రవాణా చేసి విరమించుకొన్నట్లు సమాచారం.

### రేషన్ షాపులకు అందని బియ్యం

ట్రాన్స్‌పోర్టు కాంట్రాక్టర్ విరమించుకొనే వరకు జిల్లాలోని మూడు ఎంఎల్ఎస్ గోదాములకు సుమారు 3,400 టన్నులకు పైగా బియ్యం రవాణా జరిగినట్లు తెలిసింది. వరంగల్ ఏనుమాముల గోదాముకు 400, నర్సంపేటకు 150కిపైగా టన్నుల రైస్ రవాణా కావాల్సి ఉంది. దీంతో ఏనుమాముల గోదాము పరిధిలో దాదాపు నలభై రేషన్ షాపులకు, నర్సంపేట గోదాము పరిధిలో మరికొన్ని రేషన్ షాపులకు ఈ నెలకు సంబంధించి పీడీఎస్ బియ్యం విడుదల జరగలేదు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రతి నెలలో 1 నుంచి 15లోగా కార్డుదారులకు బియ్యం పంపిణీ పూర్తి కావాల్సి ఉంది. 11వ తేదీ వరకు కూడా సుమారు 60 రేషన్ షాపులకు బియ్యం చేరుకోలేదు. పౌరసరఫరాల సంస్థ అధికారుల నిర్లక్ష్యం, ముందుచూపు లేకపోవడమే ఇందుకు కారణమని తెలిసింది. కాలపరిమితి ముగిసిన కాంట్రాక్టర్ బియ్యం రవాణా చేయనని ముందుగానే చెప్పినప్పటికీ ఆ గడువులోగా స్టేజీ-2 గోదాములకు బియ్యం రవాణా ప్రక్రియను పూర్తి చేయాల్సిన అధికారులు ఆ దిశగా ప్రయత్నాలు చేయకపోవడం చర్చనీయాంశమైంది. స్టేజీ-2గోదాములకు 550 టన్నుల బియ్యం ఎప్పుడొస్తాయి?, రేషన్ షాపులకు ఎప్పుడు చేరుతాయి?, కార్డుదారులకు పంపిణీ ఎప్పుడు జరుగుతుందనేది ప్రస్తుతం జిల్లాలో జవాబు లేని ప్రశ్నగా తయారైంది. వివరణ కోసం 'నమస్తే తెలంగాణ' ఫోన్ ద్వారా సంప్రదించగా పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ సంధ్యారాణి స్పందించలేదు.

# వెద సాగు.. బహు బాగు

**సాగులో వ్యయం తగ్గించుకునే దిశగా రైతులు అడుగులు వేస్తున్నారు. ఈ కోవలోనే వరి పంటలో వెదజల్లే పద్ధతి విస్తరిస్తున్నది. కూలీలు దొరకని పరిస్థితుల్లో వారి అవసరం లేకుండానే సాగు చేస్తున్నారు. పెట్టుబడి తగ్గడంతోపాటు ముందుగానే కోతకు వస్తుండడంతో అన్నదాతలు వెదజల్లే సాగు వైపే మొగ్గు చూపుతున్నారు. ఇప్పటికే శాయంపేట మండలంలో సుమారు వెయ్యి ఎకరాలకుపైగానే ఈ విధానంలో సాగయ్యింది.**

*- శాయంపేట, ఆగస్టు 11*



మాందారిపేటలో వరి విత్తనాలు వెదజల్లుతున్న రైతు

- వరిలో విస్తరిస్తున్న వెదజల్లే పద్ధతి
- కూలీల కొరతను అధిగమించడంతో పాటు ఖర్చు తక్కువే
- వెయ్యి ఎకరాలకుపైగానే సాగవుతున్న పంట

రైతులు వెదజల్లే పద్ధతిలో వరిని సాగు చేస్తూ పెట్టుబడి వ్యయం తగ్గించుకోవడమే కాకుండా కూలీల కొరతను అధిగమిస్తున్నారు. శాయంపేట మండలంలో ఖరీఫ్‌లో ఆరు వేల ఎకరాలకుపైగా సాగు చేస్తున్నారు. యాసంగిలో పూర్తిస్థాయిలో వెదజల్లే పద్ధతిలో రైతులు వరి సాగు చేయగా, పత్తిపాక, శాయంపేట, నేరేడుపల్లి, ప్రగతిసింగారం, కొప్పుల, సూరంపేట, గట్లకానిపర్తి తదితర గ్రామాల్లో సుమారు వెయ్యి ఎకరాల్లో సాగు చేసినట్లు అధికారులు చెబుతున్నారు. ఎకరాకు నాటు వేసే పద్ధతిలో ఒక బస్తా(30) కిలోల విత్తనాలకు సుమారు రూ. 1200 అవుతుండగా, అదే వెదజల్లే పద్ధతిలో కేవలం 12 కిలోలు అంటే రూ.400 వరకు ఖర్చవుతోంది. ఎకరాకు నాట్లు వేసేందుకు సుమారు 12 మంది కూలీలు అవసరం కాగా, ఒక్కొక్కరికి రూ.300 చొప్పున రూ.3600 వ్యయం అవుతోంది. నారు పోసేందుకూ ఖర్చవుతున్నది. ఈ ఇబ్బందులేమీ లేకుండా వెదజల్లే పద్ధతిలో రైతులే మొలకొచ్చిన విత్తనాలను పొలంలో కొన్ని గంటల్లోనే చల్లుతున్నారు. దుక్కి దున్ని, గొర్రు కొట్టి నాటు వేసేందుకు నీళ్లు ఉంచుతారు. వెదజల్లే పద్ధతిలో మాత్రం బురదగా ఉంటేనే విత్తనాలు జల్లుతున్నారు. దీంతో నీళ్ల వాడకం కూడా తక్కువగానే ఉంటున్నదని రైతులు చెబుతున్నారు. శారీరక శ్రమ కూడా తక్కువగా ఉండడంతో అన్నదాతలు వరిలో వెదజల్లే సాగుకు మక్కువ చూపుతున్నారు. మధ్యలో బాటలు తీస్తూ సమానంగా విత్తనాలు వెదజల్లుతుండడంతో పిలకలు ఆరోగ్యంగా ఉంటాయని, చీడపీడల నుంచి రక్షణ లభించి దిగుబడి మెరుగయ్యేందుకు ఆస్కారం ఉంటుందని చెబుతున్నారు. ఈ క్రమంలో వెదజల్లే సాగుపై వ్యవసాయ శాఖ పెద్ద ఎత్తున అవగాహన కల్పించాల్సిన అవసరముందని రైతులు కోరుతున్నారు.



వరికి పురుగుల మందు స్ప్రే చేస్తున్న రైతు

# పంట కాల్వలు ఇలా.. సాగు నీరందేదెలా!

గోవిందరావుపేట, ఆగస్టు 11 : వేలాది ఎకరాలకు సాగునీరందించే ములుగు జిల్లాలోని లక్నవరం సరస్సు కింద ఉన్న నాలుగు ప్రధాన కాల్వలు పిచ్చిమొక్కలు, చెత్తాచెదారంతో నిండిపోయాయి. దీంతో తమకు నీరందేదెలా అని చివరి ఆయకట్టు రైతులు ఆందోళన చెందుతున్నారు. శ్రీరాంపతి కోట, రంగాపూర్, నర్సింహుల కాల్వల ద్వారా ప్రస్తుత సీజన్‌లో పంట పొలాలకు నీరందక రైతులు ఇబ్బంది పడుతున్నారు. ఈ నాలుగు కాల్వల ద్వారా అధికారికంగా 8,500, అనధికారికంగా మరో 4 వేల ఎకరాల్లో పంట సాగవుతుంది. అయితే కాల్వల్లో పిచ్చిమొక్కలు పెరగడంతో పాటు అక్కడక్కడా గండ్లు పడ్డాయి. కాల్వల పరిస్థితిని పరిశీలించేందుకు అధికారులు అటువైపు రావడం లేదు. దీంతో పంట చివరి దశలో తమకు నీరందుతుందో లేదోననే భయాందోళనలో రైతులున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కాల్వల్లో పిచ్చిమొక్కలను తొలగించడంతో పాటు గండ్లను పూడ్చివేయాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.



పిచ్చి మొక్కలతో నిండిపోయిన రంగాపూర్ కాల్వ



కాశీబుగ్గ: బోనాలతో దేవాలయానికి బయలుదేరిన మహిళలు

# బోనమో పోచమ్మ

- పోచమ్మ, ముత్యాలమ్మ, మైసమ్మ, పెద్దమ్మలకు సమర్పణ
- ఆకట్టుకున్న శివసత్తుల పూనకాలు, పోతరాజుల విన్యాసాలు
- శ్రావణ మాస బోనాలతో సందడిగా పల్లెలు

**ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఆదివారం పల్లె, పట్టణం బోనమెత్తింది. మహిళలు భక్తిశ్రద్ధలతో ఊరేగింపుగా వచ్చి పోచమ్మకు బోనాలు సమర్పించారు. పలుచోట్ల ముత్యాలమ్మ, మైసమ్మ, పెద్దమ్మ, రేణుకా ఎల్లమ్మలకు పూజలు చేశారు. బోనంతో పాటు పసుపు, కుంకుమ, చీరెలను అమ్మవార్లకు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా శివసత్తుల పూనకాలు, పోతరాజుల విన్యాసాలు, డప్పుచప్పుళ్లు, నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. గోవిందరావుపేట గ్రామంలోని పోచమ్మ గుడిలో మంత్రి సీతక్క పూజలు చేశారు. దర్దేపల్లిలో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు దండమ్మ తల్లికి బోనం సమర్పించారు.**

*- నమస్తే నెట్‌వర్క్, ఆగస్టు 11*



నర్సంపేట రూరల్ : ముత్తోజిపేటలో పోశమ్మ బోనాల వేడుకల్లో పాల్గొన్న గ్రామస్తులు

పాలకుర్తి రూరల్: దర్దేపల్లిలో ఎడ్లబండిపై వచ్చి దండెమ్మ తల్లి బోనాల్లో పాల్గొన్న మాజీ మంత్రి ఎర్రబెల్లి




జలపాతం వ్యూ భాగంలో ఫొటోలు దిగుతూ పర్యాటకుల సందడి

# బొగత హొయలు.. చిట్టిముత్యాల చిందులు

- అందాలతో ఆకట్టుకుంటున్న జలపాతాలు
- భారీగా తరలివచ్చి సందడి చేస్తున్న పర్యాటకులు

**ములుగు జిల్లా వాజేడు మండలం చీకుపల్లి అటవీ ప్రాంతంలోని బొగత జలపాతం హొయలు పోతున్నది. ఇదే మండలం బొల్లారం, మహితాపురం గ్రామాల మధ్యలోని అటవీ ప్రాంతంలో ఉన్న చిట్టిముత్యాల జలపాతం చిందులు తొక్కుతోంది. వీటి అందాలను చూసిన పర్యాటకులు ఫిదా అవుతున్నారు. ఆదివారం సెలవు దినం కావడంతో రాష్ట్రంలోని నలు మూలల నుంచి పెద్ద ఎత్తున తరలివచ్చి సందడి చేశారు. ఫొటోలు, సెల్ఫీలు దిగుతూ, స్నానాలు చేస్తూ ఎంజాయ్ చేశారు.**

*- వాజేడు, ఆగస్టు 11*



చిట్టిముత్యాల జలపాతం వద్ద పర్యాటకుల సందడి